www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 25 ఫిబ్రవరి 2024

5



నేడు 'భూతపురి' 87వ జయంతి

కడప అర్బన్ : 'మహాకవి' 'శతావధాని' డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్ట్, అల్లసాని పెద్దన సాహిత్య పురస్కార అధ్యర్యంలో ఈ నెల 25న భూతపురి 87వ జయంతి, 22వ సాహిత్య పురస్కార ప్రదానోత్సవాన్ని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, కార్యదర్శి డాక్టర్ భూతపురి శివరామ సురేంద్ర శర్మ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వ విద్యాలయం విసి ఆచార్య బి.అంజనేయ ప్రసాద్ సభాధ్యక్షులుగా, యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్ ముఖ్య అతిథిగా విచ్చే స్తారన్నారు. డాక్టర్ భూతపురి 22వ స్మారక సాహిత్య పురస్కారాన్ని ప్రసిద్ధ కవి, విమర్శకులు, గ్రంథ పరిష్కర్త వైద్యం వేంకటేశ్వ రాచార్యులకు అందజే యనున్నామని, ఆయన్ను రూ.10,116/- నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరిస్తామని తెలియజేశారు.

టిడిపి అభ్యర్థులు వీరే..

- తొలివిడతలో కడప, అన్నమయ్యలో ముగ్గురు చొప్పున ఎంపిక
- తేలని జనసేన ఆశావహుల భవితవ్యం
- సంబరాల్లో టిడిపి శ్రేణులు

ఎట్టకేలకు టిడిపి అభ్యర్థుల నిరీక్షణ ఫలించింది. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ సంయుక్తంగా 99 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను విడుదల చేశారు. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన మూడేసి చొప్పున ఆరు అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. టికెట్ల ఖరారు కోసం నెలల తరబడి నిరీక్షించిన అభ్యర్థుల అనుచరులు బాణాసంచా పెద్దఎత్తున పేల్చి, స్వీట్లు పంచుతూ సంబరాలు చేసుకున్నారు.



ఆర్.మాధవీరెడ్డి (కడప)
బిటెక్ రవి (పులివెందుల)
పుట్టా సుధాకర్‌యాదవ్ (మైదుకూరు)
ఎం.రాంప్రసాద్‌రెడ్డి (రాయచోటి)
ఎన్.కిశోర్‌కుమార్‌రెడ్డి (పీలేరు)
డి.జయచంద్రారెడ్డి (తంబళ్లపల్లి)

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/యంత్రాంగం

ప్రతిపక్ష టిడిపి కడప జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటి ంచింది. కడప అసెంబ్లీ అభ్యర్థిగా రెడ్డప్పగారి మాధవీరెడ్డి, మైదుకూరులో పుట్టా సుధా కర్ యాదవ్, పులివెందుల అభ్యర్థిగా మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పేర్లను ప్రకటించింది. కమ లాపురం, ప్రొద్దుటూరు, బద్వేల్, జమ్మలమడుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. జమ్మలమడుగు అసెంబ్లీ స్థానానికి బిజెపి నుంచి తీవ్రమైన పోటీ ఎదురవుతున్న నేపథ్యంలో వాయిదా వేసినట్లు తెలుస్తోంది. జమ్మలమడుగు నియోజకవర్గ వ్యాప్తంగా తనదైన శైలిలో భూపేష్‌రెడ్డి పాదయాత్ర నిర్వహించడం ద్వారా యువత, మహిళల్లో పెంచుకున్న క్రేజ్‌ను నిర్లక్ష్యం చేయడం అసంతృప్తి కలిగిస్తోంది. అన్నమయ్య జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. జిల్లా కేంద్రమైన రాయచోటి అసెంబ్లీ అభ్యర్థిగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, తంబళ్లపల్లి అభ్యర్థిగా దాసరిపల్లి జయచంద్రారెడ్డి, పీలేరు అభ్యర్థిగా నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్లను ప్రకటించింది. టికెట్లు దక్కిన నాయకుల అనుచరులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్నారు. శుక్రవారం రాత్రి అసెంబ్లీ టికెట్ ఖచ్చితం లేదని సమాచారం అందు కున్న మాజీ ఎమ్మెల్యేలు ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి అనుచరులు తెలుగుదేశం పార్టీ జెండాలు ఊరేగింపుగా నాలుగు రోడ్ల కూడలిలో నిప్పంటించడం ద్వారా తీవ్రమైన వ్యతిరేకత చేయడం చర్చనీయాంశంగా మారింది. కడప, అన్నమయ్య జిల్లాల్లోని ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో అసంతృప్తుల బెడద భగ్గుమంది. టికెట్లు దక్కించుకున్న నాయకుల అనుచరులు పెద్దఎత్తున సంబరాలు చేసుకుంటున్న భిన్నమైన వాతావరణం నెలకొనడం విశేషం. రాయచోటి టికెట్ కోసం నిరీక్షించిన నలుగురు ఆశావహుల్లో ఎనలేని ఉత్కంఠకు తెరపడింది. టికెట్ దక్కించుకున్న నాయకులు ఎన్నికల ప్రచారం, ఇతర ఎత్తుగడల్లో నిమగ్నం కానున్నట్లు తెలుస్తోంది.



కడపలో సంబరాలు చేసుకుంటున్న టిడిపి అభ్యర్థి మాధవిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, అభిమానులు

గ్రూప్-2 పరీక్షకు సర్వం సిద్ధం

- జిల్లాలో 67 కేంద్రాల్లో నిర్వహణ
- పరీక్షలు రాయనున్న 23,806 మంది అభ్యర్థులు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం : డిఆర్‌ఒ
- పటిష్ట బందోబస్తు : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గ్రూప్- 2 సర్వీసెస్ (స్క్రీనింగ్ టెస్ట్)ఆబ్జెక్టివ్ టైప్ పరీక్షను ఆదివారం నిర్వహించనున్నారు. ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 67 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 23,806 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఇప్పటికే రూట్ ఆఫీసర్లు, లైసెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి 1:30 గంటల వరకు నిర్వహిస్తారు. 17 మంది రూట్ ఆఫీసర్లు (జిల్లా స్థాయి అధికారులు), 67 మంది లైజన్ ఆఫీసర్లు (మండల స్థాయి అధికారులు)ను నియమించారు. ఎక్కడా చిన్న తప్పు జరగకుండా పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసినట్లు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. మారుమూల ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకునేందుకోసం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుండి పరీక్ష కేంద్రాలలోకి అభ్యర్థులను అనుమతిస్తారు. అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలని డిఆర్‌ఒ గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించబడవన్నారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించే ఒదుకు అన్ని విధాలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.




పటిష్ట బందోబస్తు : ఎస్‌పి

కడప అర్బన్ : జిల్లాలో ఈనెల 25న ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్వహించబోయే ఎపిపిఎస్‌సి గ్రూప్ - 2 పరీక్షకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ పేర్కొన్నారు. 400 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదుగురు డిఎస్‌పిలు, 14 మంది పోలీసు అధికారులు, 25 మంది ఎస్ఐలు, వంద మంది ఎఎస్ఐలు, 160 మంది కానిస్టేబుల్స్, 80 మంది మహిళా పోలీసు కానిస్టేబుల్స్ బందోబస్తు విధుల్లో ఉంటారన్నారు. కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరులలోని పరీక్ష కేంద్రాల పర్యవేక్షణకు 17 రూట్ మొబైల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్నెట్ షాపులు మూసి వేయాలని,144 సెక్షన్ అమల్లో ఉన్నందున, పరీక్ష కేంద్రాల వద్ద ప్రజలు గుమిగూడడం నిషేధమని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు ఉన్నా కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 08562-246344 కు కాల్ చేయాలని పేర్కొన్నారు.

సంక్షేమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నాం

ప్రజాశక్తి - కడప

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల సంసిద్ధతతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రభుత్వ లక్ష్యం మేరకు సమర్థవంతంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ వి.విజయ్ రామరాజు తెలిపారు. శనివారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుంచి గ్రూప్-2 పరీక్ష ఏర్పాట్లు, రెవెన్యూ, రీసర్వే మూడవ దశ, ఇనామ్, అసైన్డ్ భూములు, హౌస్ సైట్స్ నమోదు, హౌసింగ్-గృహ నిర్మాణం, పిఅండ్ ఆర్‌డి, ఎన్ఆర్ఈజిఎస్ - కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, తాగునీరు, ప్రాధాన్యత భవనాలు, ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజుతో పాటు జెసి గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను జిల్లాలో సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేశామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలను మరోసారి తనిఖీ చేసి ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని వసతులను, సాధారణ భద్రతా ఏర్పాట్లు, సదుపాయాలను సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది రోజువారీ నివేదికలను అందిస్తున్నామన్నారు. ప్రయారిటీ సెక్టార్ల వారీగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్, డ్వామా పీడీలు కృష్ణయ్య, యదుభూషన్ రెడ్డి, పిఆర్ ఎస్ఇ శ్రీనివాసులు రెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ వీరన్న డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



విసిలో పాల్గొన్న కలెక్టర్ విజయ్‌రామరాజు

కలకలం

ప్రజాదృష్టి

వైవీయూలో కలుషిత ఆహారం ఘటన కలంకలం రేపింది. ఆహారాన్ని తయారు చేయడం మొదలుకుని వడ్డించే వరకు ఉన్నత ప్రణామాలను పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. యూనివర్శిటీ ఉన్నతాధికార యంత్రాంగం విద్యతోపాటు విద్యార్థుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ఆహార పదార్థాల విషయంలో నిరంతర పరిశీలన చేయాలి. హాస్టల్‌లో ఆహారాన్ని తయారు చేసే సిబ్బంది శుచి, శుభ్రత పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. వండిన ఆహారాన్ని పరిశీలించడానికి శాంపిల్స్‌గా తెప్పించుకుని ఓ ఉన్నతాధికారి ఆహారాన్ని తీసుకున్న అనంతరం విద్యార్థులకు వడ్డించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. లేనిపక్షంలో అనుకోని సంఘటనలు చోటుచేసుకుంటే నష్టం జరిపోతుంది. అనంతరం చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా ఉంటుందనడంలో సందేహం లేదు. తరువాత ఎవరి మీద చర్యలు తీసుకున్నా ఎటువంటి ఫలితమూ ఉండదని గ్రహించాలి. ఆర్నెళ్ల కిందట అన్నమయ్య జిల్లా సంబేపల్లి గురుకుల పాఠశాలలో ఇటువంటి సంఘటన చోటుచేసుకోవడం తెలిసిందే. ఏడాదిలో ఒకటి, రెండు హాస్టళ్లలో ఇటువంటి సంఘటనలు చోటుచేసుకోవడం పరిపాటిగా మారింది. ఇటువంటి సంఘటనల నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆలోచించాలి. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల ఆహారం విషయంలోనే నిర్లక్ష్యం కొనసాగితే నోరులేని బాలల హాస్టల్స్‌లో ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో ఆందోళన కలిగిస్తోంది. శుక్రవారం వైవీయూలో చోటు చేసుకున్న కలుషిత ఆహారం సంఘటనలో 29 మంది అస్వస్తతకు గురైన నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు హాస్టళ్లపై దృష్టి సారించాల్సి ఉంది. దీనిపై వైవీయూ ఉన్నతాధికార యంత్రాంగం విచారణ చేపట్టాలి. ఈ సంఘటనలో వైవీయూ ఉన్న తాధికార యంత్రాంగం చురుకుగా స్పందించి, హాస్పిటల్‌లో విద్యార్థులు కోలుకునే వరకు అప్రమత్తంగా వ్యవహరించడం మంచి పరిణామం. కానీ సంఘటనకు పూర్వమే జాగ్రత్తలు తీసుకుని ఉంటే బాగుండేది. విద్యార్థి సంఘాల ఆందోళనలతో యంత్రాంగం అప్రమత్తమైందని చెప్పవచుఛ్చు. ఆహారం కలుషితం కావడానికి గల కారణాలేమిటో ఆరా తీయాలి. ఎక్కడ పొరపాటు దొర్లిందో గుర్తించాలి. భవిష్యత్‌లో ఇటువంటి నిర్లక్ష్యపు సంఘటనలు పునరా వృతం గాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైవీయూలో వైద్యురాలిని నియమించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

వైవీయూలో విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, తక్షణం వైద్యురాలిని నియమించాలని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వైవీయూ విసిని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సునీల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు, యూనివర్సిటీల కన్వీనర్ ఎమ్మార్ నాయక్ కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయంలోని విద్యార్థినులు మళ్లీ అనారోగ్యానికి గురై యూనివర్సిటీలో ఉన్న హెల్త్ సెంటర్లో ఒక అబ్బాయి, ఐదుగురు అమ్మాయిలు చేరారని తెలిపారు. ఏడుగురు విద్యార్థినులను అనారోగ్య కారణంగా ఇంటికి పంపించారని చెప్పారు. విద్యార్థుల అనారోగ్యానికి కారకులైన వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. యూనివర్సిటీ అధికారులు సరైన పర్యవేక్షణ చేసి ఉంటే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకునేవి కావని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు అరుణ్, నాయకులు చంద్ర, అకిరానంద్, అశోక్, శివతేజ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యకులు రాహుల్, నాయకుల రాజశేఖరరెడ్డి, సుబ్బు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్ పిలుపు నిచ్చారు. శనివారం హోల్ హరితలో పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు. మీ సేవా కేంద్రాలు ఎటువంటి రుసుం వసూలు చేయవని చెప్పారు. పరిశ్రమలశాఖ జిఎం జయలక్ష్మి మాట్లాడుతూ పథకం గురించి సమాచారం కోసం తమ కార్యాలయాన్ని సందర్శించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి నాగరాజా, ఎంఎస్ఎంఇ డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, ఎల్‌డిఎం సునీత, కమ్యూనిటీ లీడర్లు, వాటాదారులు పాల్గొన్నారు.

బిజెపి అనుకూల వైఖరి రాష్ట్రానికి ప్రమాదకరం

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి, టిడిపి, జనసేన అనుసరిస్తున్న బిజెపి అనుకూల వైఖరి రాష్ట్రానికి ప్రమాదకరమని, బిజెపి సర్కార్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక రవీంద్ర నగర్‌లోని యుఎస్ మహల్ కల్యాణ మండపంలో ఐక్య ముస్లిం మైనార్టీ సంఘాలు, దర్గాల పరిరక్షణ కమిటీ పీఠాధిపతి, గురువులు ఖందీర్ అధ్యక్షతన 'ఇవిఎంలు వద్దు.. బ్యాలెటే ముద్దు' అనే అంశంపై సభ నిర్వహించారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు హాజరైన సిపిఎం జిల్లా మాట్లాడుతూ 2014 రాష్ట్ర విభజన చట్టంలోని ప్రధానమైన అంశాలు ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని పేర్కొన్నారు. బిజెపి సర్కార్‌తో జనసేన, టిడిపి, వైసిపి మైత్రి రాష్ట్ర ప్రజలకు తీవ్రమైన నష్టదాయకమన్నారు. దేశవ్యాప్తంగా బిజెపి రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతోందని ఎన్ఆర్‌సి, సిఎఎ, తెచ్చి దేశంలోని మైనార్టీలకు ఓటు హక్కు లేకుండా చేయటానికి ప్రయత్నించారని, దేశంలోని రాజ్యాంగ పరిరక్షణ శక్తులు, మైనార్టీలు, వామపక్షాలు, ప్రతిపక్షాలు ఐక్యంగా తిప్పి కొట్టగలిగారన్నారు. ఇప్పుడు కొత్తగా బిజెపి ఎన్నికల కుయుక్తులు చేస్తోందని అందులో భాగమే ఇవిఎంల ట్యాంపరింగ్ చిప్స్ ఏర్పాటు చేడమని తెలిపారు. బిజెపి, వైసిపి, టిడిపి, జనసేన లను రాష్ట్ర ప్రజలు నమ్మవద్దని హితవు పలికారు. టిడిపి, జనసేన మిత్ర జోడి బిజెపిని ప్రశ్నించకుండా వైసిపిని ఓడించలేరని జోశ్యం చెప్పారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

వ్యవసాయ రంగంలో రైతులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని అధిక దిగుబడులు సాధించాలని దక్షిణ మండల సహసంచాలకులు డాక్టర్ సి రమణ పేర్కొన్నారు. శనివారం ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నిర్వహించిన కిసాన్ మేళా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలు సూచనలతో ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకొని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు, రాష్ట్ర ఉద్యానవన సలహాదారులు సంబటూరు ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలో రైతులకు పెరిగిన వ్యవసాయ సాగు ఖర్చులతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వాటికి అనుగుణంగా యాంత్రికరణ చాలా దోహదపడుతుందని వివరించారు, రైతులకు సలహాలు సూచనలు ఇవ్వడంలో కృషి విజ్ఞాన కేంద్రం ముందుందని ఆయన ప్రశంసించారు. జిల్లా వ్యవసాయ సలహాదారుడు ఓబుల కొండారెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా. వ్యవసాయంఆధునిక పద్ధతులతో సాగు చేసి ఖర్చులను తగ్గించుకోవాలన్నారు. అనంతరం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శ్రీనివాస్ ఆచారి మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో వరి పైరులో వచ్చిన తెగుళ్లపై సుదీర్ఘంగా వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన ఆస్థానం శాస్త్రవేత్తలు, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి-కాశినాయన

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని, అందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిఇఒ అనురాధ పేర్కొన్నారు. శనివారం ఆమె మండల కేంద్రమైన నరసాపురంలోని ఎంఆర్‌సి కార్యాలయాన్ని, ఎపి మోడల్ పాఠశాలను, నరసాపురం జడ్‌పి హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆమె మాట్లాడి వారి నైపుణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్‌పి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అక్కడ మెనూ ప్రకారం భోజనం లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు.

టిడిపి పథకాలపై ప్రచారం

కడప అర్బన్ : నగరంలోని 33వ డివిజన్‌లో టిడిపి పథకాలపై ఆ పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, కడప అసెంబ్లీ అభ్యర్థి మాధవి రెడ్డి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జీ సుంకర శ్రీనివాస్, టిడిపి నాయకులు బిట్టా శ్రీధర్, అఖిల్, అప్సర్‌ఖాన్, సుధాకర్, మీదున్ కుమార్, కిరణ్, అఖిల్ కుమార్, రమణ, దేవతి రమణ, ఈశ్వరయ్య, ఉస్మాన్, గంగిశెట్టి, వెంకటేష్, నాగరాజు ఆచారి, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు : ఆర్ఐఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఐఒ బండి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. శనివారం వైఎస్ఆర్ జిల్లా ఇంటర్ పబ్లిక్ పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్, అడిషనల్ సూపరింటెండెంట్ సమావేశం నగరంలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కాలేజ్ సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐఒ మాట్లాడుతూ మార్చి 1 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పబ్లిక్ పరీక్షలు విధి విధానాలను, ఎగ్జామ్ సెంటర్‌లో కల్పించాల్సిన మౌలిక వసతులు, పర్యవేక్షణ, విద్యార్థులకు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి సిఎస్, డిఒలు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. సిసి కెమెరా పరివేక్షణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్షలు విజయవంతంగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. డివిఇఒ జి. శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఇంటర్ బోర్డు సూచనలను పాటిస్తూ విధులు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో డిఇసి సభ్యులు బి. వెంకటసుబ్బయ్య, బి. మురళీధర్‌రావు, ఎస్. శివహరి ప్రసాద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఆపన్న హస్తం వన్ స్టాప్ సెంటర్

ప్రజాశక్తి - కడప

ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్న హస్తం వన్ స్టాప్ సెంటర్ సఖి అని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ ఎస్ బాబా ఫక్రుద్దీన్ అన్నారు. ఒకే చోట అనేక సేవలు లభిస్తాయని చెప్పారు. శనివారం జడ్జి రిమ్స్ ఆవరణంలో ఉన్న వన్ స్టాప్ సెంటర్ ను సందర్శించారు. ఆపదలో ఉన్న మహిళలు వన్ స్టాప్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వన్ స్టాప్ సెంటర్‌లోని రిజిస్టర్స్‌ను జడ్జి పరిశీలించారు. వన్ స్టాప్ సెంటర్‌లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీస్ సాయం, మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్, వైద్య సహాయం ,తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు ఉంటాయి అని తెలిపారు. గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు ,యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు , బాల్య వివాహాలు, కిడ్నాప్లు , సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు , వరకట్న మరణాలు వంటి సందర్భాలలో మహిళలు సంప్రదించవచ్చు అని తెలిపారు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం గురించి వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, విక్టిమ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పిఆర్ జిల్లా ఉద్యోగుల సంఘం ఎన్నిక

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎపి పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లంకా మల్లేశ్వరరెడ్డి, బసిరెడ్డి శనివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ హాలులో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు జిల్లా యూనిట్ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. గత నెల రోజులుగా ఉమ్మడి కడప జిల్లాలోని 13 తాలూకాల్లో ఎపి పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించామని పేర్కొన్నారు. అనంతరం ఆయా తాలూకాలకు నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నామని తెలిపారు. ఈ నెల 25న 13 తాలూకాలకు చెందిన నూతన కార్యవర్గ సభ్యులు హాజరై జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర కార్య వర్గాన్ని ఎన్నుకుంటాయని తెలిపారు.

సహజ జీవనమే ఆరోగ్యానికి రక్ష

ప్రజాశక్తి - కడప అర్బన్

సహజ జీవనమే ఆరోగ్యానికి రక్ష అని ఆర్ట్స్ కళాశాల జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సావిత్రి పేర్కొన్నారు. శనివారం కడప ఇంద్రియ విద్యాలయంలో 'సుస్థిర అభివృద్ధి- పర్యావరణ పరిరక్షణ, సహజ జీవన విధానం' అనే అంశం పై సదస్సు ప్రిన్సిపల్ మునిష్ మీనా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఐక్యరాజ్య సమితి రూపొందించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధలో ధరిత్రి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కీలక అంశాలని అన్నారు. ఇందుకు అందరూ కాలుష్యం లేని సహజ జీవన విధానం ఒక్కటే అందరి ఆరోగ్యానికి రక్షణ అని అన్నారు. కార్యక్రమంలో గునిశెట్టి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రాజేంద్ర సింగ్, వెంకట మహేష్ కుమార్ వ్యవహరించారు. కార్యశాలలో విద్యాలయం బోధనా, బోధనేతర సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

క్రీడారంగానికి పెద్దపీట

ప్రజాశక్తి - కడప

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి క్రీడా రంగానికి పెద్దపీట వేస్తూ, ప్రాధాన్యతనిస్తూ అనేక అభివృద్ధి పనులు చేపడు తున్నారని ఉప ముఖ్య మంత్రి అంజాద్‌బాషా, ఎమ్మెల్సీ ఎం.రామ చం ద్రారెడ్డి సంయు క్తంగా పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ గ్రౌండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ కోర్టులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని దృఢ సంకల్పంతో దశాబ్దాలుగా ఉన్న మున్సిపల్ స్టేడియానికి కొత్త రూపు తీసుకొస్తున్నామనిచెప్పారు. గతంలో వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ఇండోర్ స్టేడియాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రస్తుతం రూ. 13 కోట్లతో ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కడప నగరం నుంచి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ప్రాతినిధ్యం వహించి వెళ్లారన్నారు. క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అడుగులు ముందుకు వేయడం జరుగుతోందని చెప్పారు. తొలుత రూ.38.74 లక్షలతో ఏర్పాటు చేసిన బాస్కెట్ బాల్ కోర్టును, రూ. 117. 47లతో తయారుచేసిన షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులను ప్రారంభించి శిలా ఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, శాప్ డైరెక్టర్ డానియల్ ప్రదీప్, డిఎస్‌డిఒ జగన్నాథరెడ్డి, మున్సి పల్ డిఇ కరిముల్లా, స్థానిక కార్పొరేటర్ సూర్యనారాయణరావు, ఇతర కార్పొరేటర్లు, నాయకులు తోట కృష్ణ జయ చంద్రారెడ్డి, రామ్మోహన్ శివ కేశవ, సత్య పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

కడప : అనునిత్యం పేద బడుగు బలహీన వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషిచేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని ఉప ముఖ్యమంత్రి ఎస్. బి. అంజాద్ బాషా అన్నారు. శనివారం తన నివాస కార్యాలయంలో సిఎం రిలీఫ్‌ఫండ్ కింద నలుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ. 2లక్షల చెక్కులను పంపిణీ చేశారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు సూర్యనారాయణరావు, షేక్ మహమ్మ షఫీ, నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప : ఆదివారం సెలవు దినం అయినప్పటికీ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు జిల్లా వ్యాప్తంగా యథావిధిగా పనిచేస్తాయని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బిల్లులను చెల్లించాలని ఎస్ఇ ఎస్. రమణ కోరారు. అవకాశాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

జియాలజీ పరిశోధకుడు ఫెలోషిప్‌కు ఎంపిక

కడప అర్బన్ : యోగి వేమన యూనివర్శిటీ ఎర్త్ సైన్సెస్ విభాగం పూర్వవిద్యార్థి డాక్టర్ ఇటికెల బాలాజీ భారత ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ - సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డ్ (డిఎస్‌టి- ఎస్‌సిఆర్‌బి) నేషనల్ పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ (ఎన్-పిడిఎఫ్)కు ఎంపిక అయ్యారు. ఈయన పరిశోధనకు గాను డిఎస్‌టి సెర్బ్ రూ. 27 లక్షలు మంజూరు చేశారు. యోగి వేమన యూనివర్శిటీ జియాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ వంగల సునీత మార్గదర్శకంలో డాక్టర్ ఇటికెల బాలాజీ ' పట్టణ వాటర్‌షెడ్ నిర్వహణ ' అనే అంశం పై రెండేళ్ల పాటు పరిశోధన చేయనున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్, ప్రొఫెసర్ ఎస్. రఘునాథ రెడ్డి, పిడిఎఫ్ పొందిన బాలాజీని అభినందించారు. ఆచార్య సునీత మార్గదర్శకంలో ఉత్తమ పరిశోధన చేయాలని సూచించారు. యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ డీన్ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్.ఈశ్వర్ రెడ్డి, జియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ రఘుబాబు, ప్రొఫెసర్ జయరాజు, ప్రొఫెసర్ శ్రీనివాస గౌడ్, ఇతర విభాగపు ఆచార్యులు, పరిశోధకులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా విజయదుర్గాదేవి బ్రహ్మోత్సవాలు

కడప అర్బన్ : శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం మాఘ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి వేకువజామున పుణ్యనదీ జలాలు నింపిన 9 మహా పవిత్ర కలశాలకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ పవిత్ర కళాశాలతో ఆలయం చుట్టూ మంగళవాయిద్యాలతో ప్రదక్షణలు నిర్వహించారు. శ్రీ విజయదుర్గా మల్లికార్జున వృషభవాహనంలపై ఆలయ ప్రదక్షణ గావించారు.

మూడోసారి 'పుట్టా'కు టికెట్.. పార్టీ శ్రేణుల్లో సంబరాలు

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పుట్టా సుధాకర్ యాదవ్ పేరును అధిష్టానం మూడోసారి ప్రకటించింది. చంద్రబాబు శనివారం అధికారికంగా పుట్టా పేరు ప్రకటించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. మైదుకూరు నాలుగు రోడ్ల కూడలిలో టిడిపి నాయకులు బాణాసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో సుధాకర్ యాదవ్‌ను అధిక మెజార్టీతో గెలిపించుకొని తీరుతామన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త పుట్టా సుధాకర్ యాదవ్‌ను గెలిపించుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. పుట్టా సుధాకర్ యాదవ్‌కు తెలుగుదేశం పార్టీ అధినేత టికెట్ కేటాయించడంతో అభిమానులు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఆకుల కృష్ణయ్య, పాలమాబు, రాధాకృష్ణ, లక్ష్మీనారాయణ, అక్బర్, చిన్న పాల్గొన్నారు.


సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

దువ్వూరు : మైదుకూరు నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా పుట్టా సుధాకర్ యాదవ్‌ను పార్టీ అధ్యక్షులు చంద్రబాబు ప్రకటించడంతో దువ్వూరు నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేల్చుతూ సంబరాలు చేసుకున్నారు. స్వీట్స్ పంచుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బోరెడ్డి రమణారెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనధికార ఫ్లెక్సీలు.. పంచాయతీ ఆదాయానికి తూట్లు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట మేజర్ పంచాయతీలో ఫ్లెక్సీల ఏర్పాటు ఇష్టానుసారంగా ఉంటోంది. పంచాయతీ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటూ పంచాయతీ ఆదాయానికి కొందరు తూట్లు పొడుస్తున్నారు. ఇలాంటి అనధికారిక ఫ్లెక్సీల ఏర్పాటు అధికారుల కళ్ల ముందు కనిపిస్తున్నా సంబధించిన వారికి హెచ్చరికలు జారీ చేయడం గానీ, జరిమానా విధించడం గానీ లేదు. ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలో గతంలో చిన్నపాటి వాగ్వాదాలు కూడా చోటు చేసుకున్న సంఘటనలు చాలా ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు విషయంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ప్రజలు నుంచి ఎక్కువగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం, ప్రైవేట్, వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు పలుచోట్ల దర్శనమిస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు మేజర్ పంచాయతీలో మాత్రమే కాకుండా ప్రధాన రహదారులపై ఉన్న పంచాయతీల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వం ఆదాయానికి గండి కొట్టే చర్యలకు స్వస్తి పలకాలని ప్రజలు కోరుతున్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక పురపాలక పరిధిలోని 17,18 కౌన్సిల్ వార్డులలో శనివారం జమ్మలమడుగు టిడిపి ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి సతీమణి జ్యోతి, తల్లి సరస్వతమ్మ బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరికి వార్డులోని మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. గడప గడపకు తిరుగుతూ టిడిపి మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా, భూపేష్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో కె.శ్రీను, చిన్న సేట్, పెద్దసేట్, ఇమాంసా, ఖాసీంపీరా, బాలరాజు, సురేంద్ర, సోమాచారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిటెక్ రవిని గెలిపించి.. చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తాం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఎంతో నమ్మకంతో పులివెందుల నియోజవర్గ టిడిపి అభ్యర్థిగా బిటెక్ రవిని ప్రకటించడం శుభపరిణామమని మండల టిడిపి నాయకులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో టిడిపి నాయకులు పుప్పాల శ్రీధర్‌రెడ్డి, కడప పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మురళి యాదవ్, బలపనూరు అనిల్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పులివెందులలో టిడిపి అభ్యర్థిని గెలిపించి చంద్రబాబుకు గిఫ్టుగా ఇస్తామని తెలిపారు. ఎన్నికల అనంతరం చంద్రబాబును సీఎంగా బీటెక్ రవిని మంత్రిగా చూడాలన్నదే పులివెందుల నియోజవర్గ ప్రజల ఆకాంక్షని తెలిపారు. ఆ మేరకు శక్తివంచన లేకుండా కృషి చేసి తెలుగుదేశం అధికారంలోకి తీసుకొస్తామని వారు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

పెన్నానదిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వల్లూరు

పెన్నానదిలో ప్రమాదవశాత్తూ నీట మునిగి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ వెంకట రమణ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మృతుడు చింతకొమ్మదిన్నె గ్రామానికి చెందిన చెన్నయ్య(42)గా గుర్తించారు. చెన్నయ్యకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. శనివారం మృతుడు స్నేహితులతో కలిసి పుష్పగిరికి చేరుకొని సరదాగా నీటిలో మునగడంతో సుడి గుండంలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


మృతుడు చెన్నయ్య

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అన్నవరం గ్రామంలో పశువైద్యశాల సమీపంలో అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న వ్యక్తి నుండి 30బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాశీ వెంకట సురేష్‌కుమార్ రెడ్డి మద్యం అమ్ముతున్నట్లు శనివారం సమాచారం రావడంతో తనిఖీ చేశామన్నారు. మద్యం అమ్ముతూ సిబ్బందికి పట్టుబడడంతో కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

21 తెలంగాణ మద్యం సీసాలు ..

ముద్దనూరు : అక్రమంగా మద్యం తరలిస్తున్న గుడ్డేటి గురు ప్రశాంత్‌రెడ్డి, గుడ్డేటి సురేంద్రరెడ్డిని అరెస్టు చేసినట్లు సిఐ దస్తగిరి తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం.. తొండూరు మండలం ఎనగనూరు గ్రామానికి చెందిన నిందితులు హైదరాబాద్‌లో మద్యం కొనుగోలు చేశారు. ముద్దనూరు నుండి తొండూరు తరలిస్తుండగా స్థానిక రైల్వేస్టేషన్ వెళ్లే దారిలో అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరి వద్ద నుండి తెలంగాణకు చెందిన 21 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

మట్కా బీటర్లు అరెస్టు

- రూ.20,100 నగదు స్వాధీనం

ప్రజాశక్తి - ముద్దనూరు

స్లిప్పులు కలిగి ఉన్న ఇద్దరు మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు సిఐ దస్తగిరి తెలిపారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద మట్కా స్లిప్పులు కలిగి ఉన్న ముద్దనూరుకు చెందిన షేక్ నూర్ బాషా, జమ్మలమడుగుకు చెందిన షబ్బీర్‌ను అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ.20,100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

జలవనరుల మరమ్మతులు జరిగేనా..!

నత్తనడకన ప్రగతి పనులు - ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సాగునీటి పనులు చేయడానికి మునుపటిలా కాంట్రాక్టర్లు ఉత్సాహం చూపడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన ఆమోదం ఇచ్చినా కొన్నిచోట్ల అసలు కదలిక లేదు. గతంలో టెండర్లు పిలిస్తే చాలు పనులు చేసేందుకు పోటీ తీవ్రంగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. వామ్మో.. ఆ పనులు మేం చేయ లేమని అంటూ కాంట్రాక్టర్లు వెనుకడుగు వేస్తున్నారు. మరోవైపు పనులు పొందిన కాంట్రాక్టర్లు కూడా ఎందుకనో చేయడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. క్షేత్రస్థాయిలో ప్రగతి తీరు చూస్తే నత్తేనయం అన్నట్లుంది పనుల పరిస్థితి. లింగాల మండలం పార్నపల్లి శివారులో పెంచికల బసిరెడ్డి జలాశయం వద్ద పనులు చేయడానికి కాంట్రాక్టర్లు విముఖత చూపుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలో కీలకమైన జల వనరులలో ప్రగతి పడకేసింది. పీబీఆర్ నిల్వ సామర్థ్యం 10.229 టీఎంసీలు కాగా, నేటికి 6.907 టీఎంసీల నీరుంది. ప్రధాన కట్ట పొడవు 832.75 మీటర్లు. మట్టి కట్ట 360 మీటర్లు ఉండగా, జలాలు నిల్వ ఉన్న అంతర్భాగంలో అలల తాకిడికి రాళ్లు కదిలి కుంగిపోయింది. ఇసుక బస్తాలను తీసుకొచ్చి వేశారు. కట్ట బలహీనంగా ఉందని, బలోపేతం చేయాలని నిపుణుల కమిటీ ఏడాది కిందట సిఫార్సు చేసినా ఇంతవరకు పనులు చేపట్టలేదు. ఎగువ ప్రాంతంలో 2021నవంబరులో భారీ వర్షాలు కురవడంతో వరద పోటెత్తింది. అత్యధికంగా నీరు రావడంతో స్పిల్ గేట్లు ఎత్తి 92 వేల క్యూసెక్కులను నదిలోని లోతట్టు ప్రాంతం చిత్రావతి నదిలో దిగువకు విడుదల చేశారు. కుడి వైపున 35 మీటర్లు, ఎడమ వైపున 300 మీటర్ల మేర రక్షణ గోడ పూర్తిగా దెబ్బతింది. ఈ జల వనరుల పరిధిలో పునర్నిర్మాణం, మరమ్మతులు పనులు చేయాలని ఏడాదిన్నర కిందట జిల్లాకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు రూ.15 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపించారు. ఉన్నత స్థాయిలోపరిశీలన చేసి, ఆ మేరకు రూ.14.38 కోట్లకు అనుమతిస్తూ గతేడాది ఫిబ్రవరి 28న ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే రెండు సార్లు టెండర్లు పిలిచారు. కాకపోతే ఎవరూ ముందుకు రాలేదు. సీఎం ఇలాఖాలో పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. ఈ కారణంగా ఏడాదిగా ఎలాంటి పురోగతి లేదు. ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చిన తర్వాత పనులు ఎలా సాగుతున్నాయని పట్టించుకోవట్లేదు. గండికోట ఎత్తిపోతల (జీకేఎల్ ఐ) పథకంలో భాగంగా పైడిపాళెం జలాశయం పరిధిలో పనులు చేయడానికి గతేడాది ఫిబ్రవరి 14న రూ.42.40 కోట్లకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత గుత్తపత్రాలు పిలవగా కాంట్రాక్టర్లు పోటీపడ్డారు. ఎవరికీ అప్పగించలేదు. మళ్లీ టెండర్లు ఆహ్వానించారు. ఇక్కడ పనుల్లో కదలిక లేదు. జీఎన్ఎస్ఎస్ మొదటి దశలో ప్యాకేజీ-2లో చేపట్టిన వామి కొండ, సర్వరాయసాగర్‌లో అసంపూర్తిగా ఉన్న పనులు చేపట్టడానికి రూ.212 కోట్లకు అను మతిచ్చారు. గతంలో చేసిన పనులు, అంచనాల రూపకల్పనపై పునః పరిశీలన చేయాలని నిర్ణయించడంతో సమస్య నెలకొంది. కొంతవరకు చేసి ఆపేశారు.



సిబిఆర్ రిజర్వాయర్ అంతర్భాగంలో కుంగిన గోడ, దెబ్బతిన్న సిబిఆర్ రక్షణ గోడ

కాంగ్రెస్, వామపక్షాల పొత్తుతో దుష్ట పార్టీలు చిత్తు

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్, వామపక్షాల పొత్తుతో రాష్ట్రంలోని దుష్ట శక్తులైన బిజెపి, వైసిపి, జనసేన, టిడిపి పార్టీలు చిత్తు కాకతప్పదని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్, వామపక్షాల పొత్తు ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రానికి చాలా అవసరమన్నారు. ప్రజా సమస్యలపై వామపక్ష పార్టీలు ఆలుపెరగని పోరాటం చేస్తున్నట్లు చెప్పారు.ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం, మోసం, అన్యాయం చేసిందని విమర్శించారు. రాష్ట్రానికి సంజీవని వంటి ప్రత్యేకహోదాను బిజెపి ఇవ్వకుండా పంగనామాలు పెట్టిందని చెప్పారు. రాయలసీమకు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీకి తిలోదకాలిచ్చిందన్నారు. కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయకుండా స్వస్తి పలికిందని తెలిపారు. విభజన చట్టంలోని చాలా అంశాలు అమలు చేయలేదని మండిపడ్డారు. ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేయాలని బిజెపి ప్రభుత్వం నిర్ణయించుకోవడం అత్యంత గర్హనీయమన్నారు. బిజెపికి రాష్ట్రంలో ఏమాత్రం బలం లేదన్నారు. రాష్ట్రానికి తీరం ద్రోహం చేసిన బిజెపి ప్రాపకం కోసం ప్రాంతీయ పార్టీలైనా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు పాకులాడడం సిగ్గుచేటని విమర్శించారు. బానిస పార్టీలతో రాష్ట్రానికి మేలు జరగదని తులసిరెడ్డి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెసు పార్టీతోనే ముడిపడి ఉందన్నారు. ఈనెల 26న అనంతపురం జిల్లాలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికల శంఖారావం ప్రారభిస్తారని, ఆ ఎన్నికల శంఖారావంలో వామపక్ష పార్టీలు కూడా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

3న జాతీయ ఇమ్యూనైజేషన్ డే : డిఎల్‌డిఒ


సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌డిఒ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

మార్చి 3న జరిగే జాతీయ ఇమ్యూనైజేషన్ డే సందర్భంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పక వేయించాలని జమ్మలమడుగు డివిజన్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఎంపిడిఒ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో మండలస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. కామనూరు, కల్లూరు వైద్యాధికారులు డాక్టర్ హనీఫ్ బాబా, డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి సంయుక్తంగా మాట్లాడుతూ మండలంలో ఆదివారం జరుగు పల్స్ పోలియో కార్యక్రమంలో అప్పుడే పుట్టిన బిడ్డ నుండి అయిదేళ్లలోపు పిల్లలు అందరికీ పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మండల వ్యాప్తంగా తొమ్మిది వేల మూడు వందల తొంబై ఏడు మంది చిన్నారులను గుర్తించామన్నారు. అన్ని గ్రామాల్లో డెబ్బై నాలుగు చోట్ల పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో సిహెచ్ఒ కృష్ణమ్మ, సూపర్వైజర్లు చంద్రకళ, బిఎ వరప్రసాద్, మాధవరెడ్డి, అంగన్వాడీ సూపర్వైజర్లు ఈశ్వరి, కళావతి, డిఇఒ ప్రసన్న పాల్గొన్నారు.

చాపాడు : మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ కోరారు. స్థానిక పిహెచ్‌సిలో శనివారం ఆయన వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్స్, ఆయాలు, ఉపాధ్యాయులు, వాక్సినేటర్స్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3న పోలియో కేంద్రాల్లో, 4,5 తేదీల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయాలన్నారు. మండలంలో 0-5 సంవత్సరాల పిల్లలు 3,020 మంది ఉన్నారని, 5 రూట్స్ వేశామన్నారు. 45 పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. అన్ని పోలియో కేంద్రాలలో వాక్సినేటర్స్ ఉంటారని, ఎవరికి ఇబ్బంది ఉండదన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఓబులేష్, కావ్య మాధురి, సిహెచ్ఒ మహాదేవ్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి ఎం. రాఘవయ్య, ఆశ నోడల్ పర్సన్ సుకన్య, సూపర్‌వైజర్స్ బాబురెడ్డి, సరస్వతి, హెల్త్ అసిస్టెంట్స్ భాస్కర్, రమేష్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డెక్కిన అమృత్‌నగర్ వాసులు

సిపిఎం ఆధ్వర్యంలో 50వ రోజుకు చేరుకున్న లబ్ధిదారుల ఆందోళన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అమృత్‌నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలంటూ స్థానికులు 50రోజులుగా తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విషయం విదితమే. సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానిక రాజీవ్ సర్కిల్‌లో వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ 2008లో రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పేదలకు చాలా మందికి స్థలాలు ఇచ్చారు.. కానీ మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రమంతా ఊర్లు నిర్మిస్తున్నామని చెప్పుకుంటున్నా నాయకులు పేదల కాలనీలో మౌలిక వసతులు ఎందుకు ఏర్పాటు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. పేదలు దాదాపుగా 15 సంవత్సరాల నుండి శాంతియుతంగా అధికారుల చుట్టూ తిరుగుతున్న పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో వెంకట్, మధు, హసీనా, పుష్పలత, మల్లికా, భాను, గోవిందమ్మ, శంషాద్, షకీలా, సరస్వతి, సుబ్బమ్మ, జయమ్మ, అరుణకుమారి చెన్నారెడ్డి, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రాజీవ్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు, సిపిఎం నాయకులు

సతీష్‌రెడ్డితో వైసిపి నేతల మంతనాలు

ప్రజాశక్తి - వేంపల్లె

శాసన మండలి డిప్యూటీ మాజీ చైర్మన్ సతీష్‌కుమార్‌రెడ్డితో వైసిపి నేతలు మంతనాలు జరిపారు. శనివారం సాయంత్రం వేంపల్లెలో ఉన్న సతీష్‌కుమార్‌రెడ్డిని కడప మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, గిరిధర్‌రెడ్డి కలిశారు. దాదాపు గంటపాటు సతీష్‌రెడ్డి ఇంట్లో ముగ్గురు ఏకతంగా చర్చలు జరిపారు. టిడిపికి రాజీనామా చేసి మౌనంగా ఉన్న సతీష్‌రెడ్డిని వైసిపిలోకి వారు ఆహ్వానించినట్లు తెలిసింది. పార్టీలో సతీష్‌రెడ్డికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. టిడిపి విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుండి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి పేరును ప్రకటించడంతో సతీష్ కుమార్‌రెడ్డిని వైసిపిలో చేర్చుకుంటే బావుంటుందనే భావనతో అధిష్టానం నిర్ణయం మేరకు సతీష్‌రెడ్డి ఇంటికి వచ్చినట్లు తెలిసింది. సతీష్‌రెడ్డి కూడా వైసిపిలోకి వెళ్లేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. రాయచోటి సీటు రమేష్‌రెడ్డికి రాకపోవడంతో ఆయనను కూడా వైసిపిలోకి సతీష్‌రెడ్డి వెంబడే తెచ్చేందుకు చర్చలు జరిగినట్లు తెలిసింది. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి వర్గీయులు ఆయన ఇంటి వద్దకు భారీగా తరలి వచ్చారు.

అసమ్మతి ఎక్కడా లేదు : ఎమ్మెల్యే రాచమల్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో తన పట్ల ఎక్కడా అసమ్మతిలేదని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శనివారం స్థానిక ఎనిమిదవ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వార్డులో పేదలు అధికంగా ఉన్నారని, వీరికి ముఖ్యమంత్రి జగన్ అమలుచేస్తున్న సంక్షేమ ఫలాలు అందరికీ అందాయన్నారు. రూ.150కోట్లతో పట్టణవాసులకు తానందించిన మంచినీటి ఫథకం అధికంగా తనను దగ్గర చేసిందన్నారు. నియోజకవర్గంలో తను చేపట్టిన అభివృద్ధి పథకాల గురించి వివరించారు. అనంతరం ఓ ప్రశ్నకు బదులుగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో తనకు ఎక్కడా చెప్పుకోతగ్గ అసమ్మతి లేదన్నారు. నియోజకవర్గంలో 120మంది ప్రజాప్రతినిధలున్నారని తెలిపారు. వీరిలో ఒక ఎంపిటిసి, ఒక సర్పంచ్, ఒక కౌన్సిలర్ అసమ్మతితో ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాగుల శాంతితోపాటు వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా..

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వైసిపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శిగా ఎర్రగుంట్ల ప్రకాష్ నగర్‌కు చెందిన మోపూరి ప్రశాంత్ నియమితులయ్యారు. ఆ మేరకు జిల్లా పార్టీ కార్యాలయం నుండి శనివారం ఉత్తర్వులు అందాయని ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా పార్టీకి చేస్తున్న సేవకు గుర్తింపుగా పార్టీ అధిష్టానం ఈ పదవి నివ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇందుకు కారణమైన ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం తన వంతు పూర్తి సహకారాన్ని అందిస్తానని ప్రశాంత్ తెలిపారు.



ముస్లిముల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్

- హజ్‌హౌస్ కమిటీ డైరెక్టర్ మునీర్

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల నిజమైన పక్ష పాతి అని హజ్‌హౌస్ కమిటీ డైరెక్టర్ మునీర్ పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ముస్లింల అభ్యున్నతికి సిఎం జగన్ కృషి చేస్తున్నట్లు చెప్పారు. సామాజిక న్యాయంలో భాగంగా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇప్పటికే వైసిపి నుండి 6 మంది ముస్లింలను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారన్నారు. టిడిపి విడుదల చేసిన 94 స్థానాల్లో కేవలం ఒక్క స్థానాన్ని ముస్లింలకు కేటాయించడం గర్హనీయమని చెప్పారు. అభ్యర్థుల స్థానా లను కేటాయింపులోనే ఏ పార్టీ ముస్లింలకు అండగా, తోడుగా ఉందో అర్థం చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. దివంగత నేత వైఎస్ఆర్ ముస్లింల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. వైఎస్ఆర్ అడుగు జాడల్లోనే ఆయన తనయుడు సిఎం జగన్ ముస్లింల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు చెప్పారు. ఉన్నత విద్య అభ్యసించేందుకు వేంపల్లెలో ఉర్దూ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. ముస్లింలకు అండగా ఉన్న వైసిపికే మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు.



అధిష్టానం ఆదేశిస్తే జగన్‌పై పోటీకి సిద్ధం

- ఎఐసిసి సభ్యుడు ధ్రువకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో పులివెందుల నియోజక వర్గం నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఎఐసిసి సభ్యుడు, ఎన్ యుఎస్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూలంరెడ్డి ధృవకుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పులివెందుల అసెంబ్లీ ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసేందుకు దరఖాస్తును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ధృవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఆశీస్సులు, పిసిసి అధ్యక్షురాలు షర్మిలారెడ్డి సహకారంతో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 15ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి విభాగంలో పని చేశానని తెలిపారు. జగన్ రెడ్డిపై పోటీ చేసి మెజార్టీ తగ్గించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెసు పార్టీలో గుర్తింపు వచ్చేందుకు తనకు సహకరించిన పిసిసి మాజీ అధ్యక్షులు సాకే శైలజానాథ్, గిడుగు రుద్రరాజు, రఘువీరారెడ్డి, ఎన్‌యుఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధు యాదవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పులివెందుల సీటు తనకు కేటాయిస్తారని ఆశిస్తున్నానని తెలిపారు.

తాగునీటిని వృథా చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చాపాడు

వేసవి ప్రారంభం కావడం గ్రామంలో నెలకొన్న తీవ్ర నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు తాగునీటిని వృథా చేయరాదని పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఇన్‌ఛార్జి ఓబులేస్ తెలిపారు. అవసరం మేరకే నీటిని వాడుకోవాలని సూచించారు. శనివారం చియ్యపాడు, గుంత చియ్యపాడు గ్రామాల్లో వారు పర్యటించారు. తాగునీటి పైపులైన్‌ను అక్రమంగా పంటలకు వాడుతున్న వారిని గుర్తించి వెంటనే తొలగించాలని సూచించారు. ప్రతి ఇంటి దగ్గర నీరు వృథాగా వదులుతున్న వారిని గుర్తించి అవగాహన కల్పించారు. దెబ్బతిన్న కుళాయిలను రిపేర్ చేయించారు. రోడ్ల వెంబడి మురికి నీటి వదులుతూ, తాగునీటిని వృథా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

చేతి పంపులకు మరమ్మతులు

ప్రజాశక్తి - చాపాడు

వేసవి ప్రారంభం కావడంతో తాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో దెబ్బతిన్న చేతిపంపులకు మరమ్మతులు చేపడుతున్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి గత మండల సర్వసభ్య సమావేశంలో అధికారులకు సూచించారు. అందుకు స్పందించిన ఎంపిడిఒ మహబూబ్ బీ, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ భరత్‌కుమార్‌రెడ్డి అన్ని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మోటర్లు, చేతిపంపుల రిపేర్లు చేపడుతున్నారు. అవసరమైన బోర్లలో అదనపు పైపులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తింది. దీంతో అవసరమైన చర్యలను అధికారులు చేపడుతున్నారు. మండల వ్యాప్తంగా 300 వరకు చేతిపంపులు ఉన్నాయి. వీటిలో చాలావరకు పనిచేస్తున్నాయి. పనిచేయని వాటిని గుర్తించి రిపేర్లు చేపడుతున్నారు. చియ్యపాడు, చాపాడు, సిద్ధారెడ్డిపల్లి గ్రామంలో తాగునీటి ఎద్దడి అధికంగా ఉంది. ఆయా గ్రామాల్లో అధికారులు పలు చర్యలు చేపట్టారు. సిద్ధారెడ్డిపల్లెలో దెబ్బతిన్న చేతిపంపులను సర్పంచు హాజరత్‌రెడ్డి ఆధ్వర్యంలో మరమ్మతులు చేపడుతున్నారు. చియ్యపాడులో నూతన బోరు వేసేందుకు ఏర్పాటు చేపడుతూ నీటి వృథాను అరికట్టే చర్యలు చేపడుతున్నారు.

తాగునీటిపై ఫిర్యాదులు రావొద్దు

ప్రజాశక్తి - వేంపల్లె

జగనన్న కాలనీల్లో తాగునీరు రాలేదని ప్రజల నుండి ఫిర్యాదులు రావద్దని ఎంపిడిఒ సంపతి దివిజా తెలిపారు. పులివెందుల ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో ఉన్న జగనన్న కాలనీని శనివారం ఎంపిడిఒ పరిశీలించారు. కాలనీకి సరఫరా అవుతున్న తాగునీటిపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీలో తాగునీరు సక్రమం సరఫరా కాలేదని ఫిర్యాదు వస్తున్నట్లు చెప్పారు. వేసవికాలంలో కాలనీ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని కోరారు. నీరు వృథాగా పోకుండా లీకేజీ ఉన్న పైపులను కూడా మరమ్మతులు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిటిసి పద్మా రాజ్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రమేష్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది శివయ్య పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం

- ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి రథయాత్ర శోభాయమానంగా పులివెందుల పట్టణంలో శనివారం జరిగింది. పట్టణంలో పాత బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు స్వామివారికి వివిధ రకాల పూజా కార్యక్రమాలు అర్చన, అభిషేకాలతోపాటు వాహనసేవలను నిర్వహించారు. యాత్రలో వెంకన్న స్వామిని పట్టణంలోని వీధులలో ఊరేగించారు. స్థానికులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రథోత్సవం ముంగిట వివిధ రకాల వేషధారణలతో ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళితోపాటు పట్టణంలోని ప్రముఖులను సన్మానించారు.

శివరాత్రి వేడుకలకు ఆహ్వానం

ప్రజాశక్తి - చక్రాయపేట

స్థానిక మండల కేంద్రంలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి, వీరభద్ర స్వామి దేవాలయ ఆవరణలో మహాశివరాత్రి ఉత్సవాలకు అందరూ రావాలని చైర్మన్ మోపూరి రామాంజనేయరెడ్డి కోరారు. శనివారం అద్దాలమర్రి, చెరుకంపల్లె, కుమార్ కాల్వ, వెన్నపల్లె, సిద్ధారెడ్డిగారిపల్లె, జోరెడ్డిగారి పల్లె, జగన్ కాలనీ, తక్కల్లపల్లి, మల్లప్పగారిపల్లె, నక్కలదిన్నెపల్లె, కె.రాజుపల్లి, కుప్పం, గ్రామాల్లో శ్రీదేవి భూదేవితోపాటు వెంకటేశ్వరస్వామి శివపార్వతుల ఉత్సవ విగ్రహాలతో ఐదు గుర్రాల రథంపై గ్రామోత్సవం చేసుకుంటూ ఆహ్వాన పత్రిక పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోపూరి రామాంజనేయరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మాజీ చైర్మన్ బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి కమిటీ సభ్యులు రామ చంద్రారెడ్డి, యోగేశ్వరరెడ్డి, కృష్ణగిరి ఈశ్వరయ్య, పెంచలయ్య, దస్తగిరిరెడ్డి, ఈశ్వరయ్య, మీసేవ రమణారెడ్డి, దామా రామకృష్ణ, ఎద్దుల ఓబులేసు పాల్గొన్నారు.


గ్రామోత్సవంలో నిర్వాహకులు